సాక్షి పెద్దపల్లి

ఆదివారం ; 3 ; మార్చి ; 2024



సాగునీటిని వృథా చేయొద్దు

కమాన్‌పూర్: యాసంగిలో వరి పంటకు వారబందీ పద్ధతిన విడుదల చేస్తున్న సాగు నీటిని వృథా చేయొద్దని ఎస్సారెస్పీ ఏఈఈ ప్రసాద్, ఏవో ప్రమోద్‌కుమార్ కోరారు.



నెమలికి చికిత్స

ధర్మారం : స్థానిక మల్లన్న గుట్ట సమీపంలో అస్వస్థతకు గురై పడిపోయిన నెమలికి అటవీశాఖ బీట్ అధికారి స్వాతి శనివారం వెటర్నరీ ఆస్పత్రిలో చికిత్స చేయించారు.

గరిష్టం/కనిష్టం
36.4/23.6

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగలు ఎండగా ఉంటుంది. ఉదయం, రాత్రి వేళ చలితీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రైతులు సహకరించాలి

మంథని: ఎస్సారెస్పీ చివరి ఆయకట్టు వరకూ సాగునీరు అందడంలేదని, ఎగువన ఉన్న రైతులు సహకరించాలని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. మంథని ప్రాంతంలో సాగునీరు అందక పంటలు ఎండుతున్నాయని, జగిత్యాల ప్రాంత రైతులు పెద్దపల్లి జిల్లా రైతులకు నీరు వచ్చేలా సహకరించాలని ఆయన కోరారు. అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల కలెక్టర్లతోపాటు నీటిపారుదల శాఖ సీఈ, ఇతర ఉన్నతాధికారులతో పది రోజులుగా సాగునీటి సరఫరాపై సమీక్ష చేస్తున్నట్లు చెప్పారు. నీటి దుర్వినియోగాన్ని అరికట్టాలని మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీచేసినట్లు తెలిపారు. నేడు, లేదా రేపటిలోగా చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు.

తెల్లరేషన్‌కార్డుదారులు అందరూ అర్హులే..



మీటర్ రీడింగ్ తీస్తున్న ఎమ్మెల్యే ఠాకూర్

రామగుండం: తెల్లరేషన్‌కార్డు కలిగి ఉండి, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారందరూ గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పొందేందుకు అర్హులని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. రామగుండం కార్పొరేషన్ 21వ డివిజన్‌లో మక్కాన్‌సింగ్ శనివారం ఓ గృహ వినియోగదారు విద్యుత్ మీటర్ రీడింగ్ తీసి జీరో బిల్లు అందజేశారు. రామగుండ మండలంలో సుమారు 6,500, అంతర్గాం మండలంలో 4,545 మంది వినియోగదారులు ఉచిత విద్యుత్‌కు అర్హత సాధించారని తెలిపారు. కార్పొరేటర్ అమ్రీన్ ఫాతిమా, సలీంబేగ్, మాజీ కౌన్సిలర్ ఇసంపెల్లి అంజులు, ఈదునూరి హరిప్రసాద్, ఎన్పీడీసీఎల్ ఏఈలు బేతి దామోదర్‌రావు, ఆశ శంకర్ పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్‌కు అభినందన

మంథని: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్‌గా పనిచేస్తున్న తస్లీమా సోని గురుకుల జూనియర్ లెక్చరర్(జేఎల్)గా ఉద్యోగం సాధించడంపై ప్రిన్సిపల్ తాహెర్ హుస్సేన్ అభినందించారు. ఆమె మహిళలకు ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యుఏసీ కో ఆర్డినేటర్ కృష్ణ, అకడమిక్ కో ఆర్డినేటర్ పరిషయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థికసాయం



సాయం చేస్తున్న కుమార్‌స్వామి

రామగిరి(మంథని): కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ, రెగ్యులర్‌గా డయాలసిస్ చేయించుకుంటున్న కల్వచర్ల గ్రామానికి చెందిన రొడ్డ శంకర్‌కు శనివారం సింగరేణి కార్మికుడు రేండ్ల కుమార్‌స్వామి రూ.5వేలు సాయం చేశారు. శంకర్ కిడ్నీ సంబంధిత సమస్యతో బాధపడుతున్నాడని గ్రామ యువకులు కుమార్‌స్వామి దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించి ఈ సాయం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు రొడ్డ రాములు, రొడ్డ సంపత్, రొడ్డ విజయ్, మారుపక రమేశ్, బూడిద సంపత్, అనుమల సురేశ్, కన్నాల రమేశ్, రేండ్ల మధుసూదన్, ముత్యం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ లైన్‌మన్ సస్పెన్షన్

ఓదెల(పెద్దపల్లి): గూడెం గ్రామంలోని జూనియర్ లైన్‌మన్ అజయ్‌ను సస్పెండ్ చేసినట్లు ట్రాన్స్‌కో పెద్దపల్లి డీఈఈ దాసరి తిరుపతి శనివారం తెలిపారు. కాల్వశ్రీరాంపూర్ సబ్ డివిజన్ పొత్కపల్లి సెక్షన్ పరిధి లైన్‌మన్ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోపాటు విద్యుత్ వినియోగదారుల నుంచి వసూలు చేసిన బిల్లులను సకాలంలో సంస్థకు చెల్లించకుండా అలసత్వం వహించినట్లు ఫిర్యాదులు వచ్చాయని పేర్కొన్నారు. ఈ మేరకు చేపట్టిన విచారణలో ఆరోపణలు నిర్ధారణ కావడంతో లైన్‌మన్‌ను సస్పెండ్ చేసినట్లు డీఈఈ వివరించారు.

109శాతం బొగ్గు ఉత్పత్తి

గోదావరిఖని: ఫిబ్రవరిలో ఆర్జీ–2లో 109 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు జీఎం ఎల్వీ సూర్యనారాయణ శనివారం తెలిపారు. నిర్దేశిత 9,77,700 టన్నులకు 10,70,127 టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించామన్నారు. 51,70,000 క్యూబిక్ మీటర్లకు 43,21,640 క్యూబిక్ మీటర్ల ఓబీ వెలికి తీసి 84 శాతం నమోదు చేశామని వివరించారు. ఓసీపీ–3 సీహెచ్‌పీ నుంచి 10,45,808 టన్నుల బొగ్గు రవాణా చేశామని తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి ఆర్జీ–2 ఏరియాకు కేటాయించిన 86,20,000 టన్నులకు 85,57,699 టన్నుల బొగ్గు ఉత్పత్తి తీసి 99 శాతం నమోదు చేశామని వివరించారు. సీఎండి బలరాం మార్గనిర్దేశంలో భవిష్యత్‌లో 100 శాతం ఉత్పత్తి సాధిస్తామన్నారు.

‘చేయి’ పట్టుకుంటారా?

- బల్దియాలో ‘కారు’ పార్టీ కనుమరుగు కానుందా?
- కాంగ్రెస్ వైపే 23 మంది కార్పొరేటర్ల మొగ్గు!
- కొందరి చేరికపై ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ విముఖత
- రాబోయే 10 నెలల పదవీ కాలం సద్వినియోగంపైనే దృష్టి
- రామగుండం నగరంలో హాట్‌టాపిక్‌గా బల్దియా రాజకీయం



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నగర మేయర్ అనిల్‌కుమార్, కార్పొరేటర్లు(ఫైల్)

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగర పాలికలో కారు కనుమరుగు కానుందా? మెజారిటీ కార్పొరేటర్లు కారు దిగి కాంగ్రెస్ చేయి పట్టకోనున్నారా?.. ఇటీవల రామగుండం బల్దియాలో చోటుచేసుకుంటున్న పరిణామాలు గమనిస్తే ఇవే విషయాలు స్పష్టమవుతున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం.. స్థానిక ఎమ్మెల్యే అధికార పార్టీకి చెందిన వ్యక్తి కావడం, సొంత పార్టీ కార్పొరేటర్లే మేయర్‌పై అవిశ్వాసం ప్రవేశ పెట్టే యోచన చేయడం.. బీఆర్ఎస్ అధిష్టానం జోక్యం చేసుకోకపోవడం.. లోపాయికారిగా కాంగ్రెస్ పార్టీ అభయ హస్తం అందించి, అవిశ్వాస ప్రయత్నాలను ఆదిలోనే విఫలం చేయడంతో నగర పాలకవర్గంలో కాంగెస్ పార్టీకి బలం పెరిగింది. ఈ నేపథ్యంలో తమ పనులు జరగాలంటే కాంగ్రెస్‌లో చేరడం తప్ప మరోదారి లేదని భావించిన మెజారిటీ బీఆర్ఎస్ కార్పొరేటర్లు.. కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకోవడానికి తహతహలాడుతున్నారని సమాచారం. ఈ రాజకీయం నగరంలో హాట్‌టాపిక్‌గా మారింది.

‘చెయ్యి’ పట్టుకోవడానికి 23మంది రెడీ..!

- ‘కారు’దిగి ‘చెయ్యి’ పట్టుకోవడానికి సుమారు 23 మంది కార్పొరేటర్లు సిద్ధంగా ఉన్నారని తెలిసింది.
- వీరంతా కాంగ్రెస్‌లో చేరడానికి మార్గం సుగమమైందని తెలుస్తోంది.
- ఇక రేపో మాపో ముహూర్తం చూసుకుని వీరంతా కాంగ్రెస్ కండువా కప్పుకోవడానికి సిద్ధంగా ఉన్నారని సమాచారం.
- శనివారమే ముహూర్తం ఖరారైనా.. మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతి కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు బిజీగా ఉండడంతో తమ ప్రయత్నాలను వాయిదా వేసుకున్నట్లు తెలిసింది.
- లోక్ సభ ఎన్నికల షెడ్యూల్‌కు ముందే తొలివిడతగా 20 మంది నుంచి 23 మంది వరకు కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీలో చేరుతారని, ఆ తర్వాత మేయర్‌తో సహా మిగిలిన వారంతా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుంటారని విశ్వసనీయ సమాచారం.

కాంగ్రెస్ వైపే మొగ్గు..

రామగుండం నగరపాలక సంస్థలోని 50 డివిజన్లలో ఒక స్థానం ఖాళీగా ఉంది. ప్రస్తుతం 49 మంది కార్పొరేటర్లు ఉన్నారు. ఇందులో మేయర్, డిప్యూటీ మేయర్ మినహా మిగతా వారు కార్పొరేటర్లు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీకి చెందిన పది మంది కార్పొరేటర్లు ఉండగా, నలుగురైదుగురు మినహా మిగిలిన వారంతా కాంగ్రెస్ పార్టీలో చేరడానికే మొగ్గు చూపుతున్నట్లుగా తెలుస్తున్నది.

కొందరి చేరికపై ఎమ్మెల్యే విముఖత..

- తనపై, తన కుటుంబ సభ్యులపై రాజకీయంగానే కాకుండా వ్యక్తిగత విమర్శలకు దిగి నష్టం చేసిన వారిని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవడానికి స్థానిక ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ విముఖత వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.
- దీంతో కొందరు కార్పొరేటర్లు తమకు ఉన్న పాత పరిచయంతో మంత్రి శ్రీధర్‌బాబు, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను ఆశ్రయిస్తున్నారని తెలుస్తోంది.
- తన వైఖరి కొంత సడలించుకున్నా.. వ్యక్తిగతంగా తీవ్ర విమర్శలు, తనను ఓడించడానికి గట్టి ప్రయత్నాలు చేసిన కొందరు కార్పొరేటర్ల విషయంలో తాను అనుసరించే వైఖరిలో మార్పు లేదని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ కరాఖండిగా చెప్పినట్లు సమాచారం.

సీఎం చిత్రపటానికి మేయర్ క్షీరాభిషేకం..

రామగుండం నగరపాలక సంస్థ అభివృద్ధికి టీయూఎఫ్ఐడీసీ నుంచి రూ.100 కోట్లు మంజూరు చేసినందుకు నగర మేయర్ బంగి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్‌తోపాటు పలువురు బీఆర్ఎస్‌కు చెందిన కార్పొరేటర్లు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా మాట్లాడడంతో వారి భవిష్యత్ రాజకీయ ప్రస్థానం ఎటువైపు ఉందో చెప్పకనే చెబుతున్నది. ఏదేమైనా రాబోయే 10 నెలల పదవీ కాలాన్ని సద్వినియోగం చేసుకొని అధికార పార్టీ అండదండలతో తమ పనులన్నీ చక్కబెట్టుకోవాలని కార్పొరేటర్లు వ్యూహాలు రచిస్తున్నారని తెలుస్తోంది. ఇందులో భాగంగానే వచ్చే ఎన్నికల్లోనూ తమ ఉనికి చాటుకోవాలని పలువురు కార్పొరేటర్లు భావిస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

సేవలకు గుర్తింపు లభించింది





నివాళి అర్పిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్, అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్

- సాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ఎత్తిపోతల
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- ఘనంగా మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతి

మంథని: పేదల సంక్షేమం కోసం చివరి వరకూ పనిచేసిన దివంగత అసెంబ్లీ మాజీ స్పీకర్, మంథని మాజీ ఎమ్మెల్యే శ్రీపాదరావు సేవలను ప్రభుత్వం గుర్తించి అధికారికంగా జయంతి నిర్వహించడం సంతోషకరమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శ్రీపాదరావు 87వ జయంతి సందర్భంగా స్థానిక శ్రీపాద చౌరస్తాలోని శ్రీపాదరావు విగ్రహానికి మంత్రి శ్రీధర్‌బాబు శనివారం పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడారు. తెలంగాణలోని అరుదైన నాయకుల్లో శ్రీపాదరావు ఒకరని, ఆయన సేవలకు గుర్తింపుగా అధికారికంగా జయంతి నిర్వహించాలని ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లారని, ఈమేరకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని మంత్రి తెలిపారు. విద్య, వైద్యం, ఉపాధి తదితర రంగాల్లో మంథని ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని అన్నారు. ప్రధానంగా సాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలనేది తమ తండ్రి లక్ష్యమని, దానిని నెరవేర్చే దిశగా ఎత్తిపోతల ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా.. మంచిర్యాల జిల్లా శివ్వారం వరకు రూ.125 కోట్లతో చేపట్టిన వంతెన నిర్మాణం పూర్తయ్యాక మంథని పట్టణం వాణిజ్యపరంగా మరింత ప్రగతి సాధిస్తుందని చెప్పారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి దిశగా పాలన సాగిస్తున్న ప్రభుత్వంపై సంఘ విద్రోహశక్తుల అసత్య ప్రచారంపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. అనంతరం రావులచెరువు శ్రీపాదరావు విగ్రహం, త్రీడి ఆర్టిస్ట్ సింగారపు రామకృష్ణ రూపొందించిన త్రీడి చిత్రం వద్ద మంత్రి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీ చేశారు. మంథని సామాజిక ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేశారు. గాంధీచౌక్‌లో అన్నదానం చేశారు. అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీపాదరావు సేవలు చిరస్మరణీయం

కోల్‌సిటీ(రామగుండం): మకుటం లేని రాజకీయ నాయకుడు దివంగత మాజీ శాసనసభాపతి శ్రీపాదరావు అని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కొనియాడారు. శనివారం శ్రీపాదరావు జయంతి సందర్భంగా గోదావరిఖని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రీపాదరావు విగ్రహానికి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. శ్రీపాదరావు పేదల పెన్నిధని పేర్కొన్నారు. ఆయన సంక్షేమానికి అహర్నిశలు శ్రమించారని ఎమ్మెల్యే గుర్తుచేశారు.

శ్రీపాదరావుకు ఘననివాళి

పెద్దపల్లిరూరల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతిగా సేవలు అందించిన దివంగత నాయకుడు దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. శ్రీపాదరావు చిత్రపటానికి అడిషనల్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్, అధికారులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ బండి ప్రకాశ్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



మేయర్ అనిల్‌కుమార్‌తో కలిసి అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థలోని 26వ డివిజన్‌లో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు నగర మేయర్ బంగి అనిల్‌కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ శనివారం శంకుస్థాపన చేశారు. కృష్ణటెంపుల్ ఏరియాలో రూ.8లక్షల పట్టణ ప్రగతి నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులు నాణ్యతతో చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మంచికట్ల దయాకర్, నాయకులు దాసరి సాంబమూర్తి, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రిలిమ్స్‌కు ఉచిత శిక్షణ

పెద్దపల్లిరూరల్: బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు గ్రూప్–1 ప్రిలిమ్స్‌కు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రవికుమార్ శనివారం తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లికి చెందిన నిరుద్యోగులు ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అభ్యర్థులు స్వయంగా వచ్చి ఈనెల 7లోగా కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.5 లక్షలకు మించొద్దని ఆయన సూచించారు. డిగ్రీ 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని అన్నారు. కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతోపాటు ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, గ్రూప్ –1 దరఖాస్తు రశీదు ఫారం అందించాలని రవికుమార్ పేర్కొన్నారు. ఇతర వివరాలకు 0878–2268686 ఫోన్‌నంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

సమాజ వికాసానికి దిక్సూచీలు కవులు

- ఉదయ సాహితీ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు దాస్యం లక్ష్మయ్య



సంకలనం ఆవిష్కరిస్తున్న కవులు, మేధావులు

జ్యోతినగర్(రామగుండం): సమాజ వికాసానికి కవులు దిక్సూచిలు అని ఉదయ సాహితీ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు దాస్యం లక్ష్మయ్య అన్నారు. శనివారం ఎన్టీపీసీ పర్మినెంట్ టౌన్‌షిప్ జ్యోతిక రిక్రియేషన్ క్లబ్‌లో తెలంగాణ, ఎన్టీపీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్, ఎన్టీపీసీ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో జ్యోతి కిరణాలు వచన కవితా సంకలనం పుస్తకం ఆవిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. నేడు పుస్తకాలు చదివే వారి సంఖ్య తగ్గిందన్నారు. ఈనేపథ్యంలో మన కవులు కవితా సంకలాన్ని ప్రజలకు అందించేందుకు చేసిన కృషి అభినందనీయమన్నారు. ప్రతిఒక్కరూ సమాజంలో తన కంటూ ఓ ప్రత్యేకత ఉండేలా జీవనం కొనసాగించాలని సూచించారు. ఎన్టీపీసీలో ఉద్యోగ విరమణ తర్వాత సమాజానికి ఉపయోగపడే అంశాలతో కవితా సంకలాన్ని పుస్తకంగా రూపొందించిన కవులు మంచికట్ల లక్ష్మణ్, నాగభూషణాచారి, రాములు ఎడెల్లి, రాజన్న నగునూరి అభినందనీయులన్నారు. ఐఎన్టీయూసీ జాతీయ సీనియర్ కార్యదర్శి బాబర్ సలీంపాషా, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆకుల రాంకిషన్ అందించిన సందేశాన్ని సభికులకు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి, వ్యాఖ్యాత మాడిశెట్టి గోపాల్, ఎన్టీపీసీ మజ్దూర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కాసర్ల వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి బండారి కనకయ్య, అడిషనల్ జనరల్ సెక్రటరీ కందుల స్వామి, జ్యోతిక క్లబ్ సెక్రటరీ రాజనర్సయ్య, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఇన్‌చార్జి వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమల సురేందర్, ప్రధాన కార్యదర్శి సట్టు ముత్యాలు, చెప్యాల శ్రీపతిరావు, రాంనారాయణ, దుర్గం నర్సయ్య, లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

- జిల్లా అదనపు న్యాయమూర్తి శ్రీనివాస్‌రావు



మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాస్‌రావు

గోదావరిఖనిటౌన్: సత్వర న్యాయం కోసం ఈనెల 16న చేపట్టే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా అదనపు న్యాయమూర్తి శ్రీనివాస్‌రావు అన్నారు. జిల్లా అదనపు న్యాయస్థానంలో శనివారం జరిగిన లోక్ ఆదాలత్ సన్నాహక సమావేశంలో గోదావరిఖని సబ్ డివిజన్ పోలీసులతో సమీక్షించారు. ఇరువర్గాలు రాజీతో కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. ఇందుకోసం పోలీస్‌స్టేషన్ల వారీగా కేసులను గుర్తించి జాబితా తయారు చేయాలని అన్నారు. గోదావరిఖని 1, 2వ అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్‌లు దుర్గం గణేశ్, వెంకటేశ్, దుర్గ, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవీందర్, నవీదా ఫరిహీన్, గోదావరిఖని ఏసీపీ రమేశ్, వన్‌టౌన్, రామగుండం, గోదావరిఖని 2వ, మంథని సీఐలు ఇంద్రాసేనారెడ్డి, అజయ్‌బాబు, రవీందర్, వెంకటేశ్వర్లు, ఎస్సైలు సతీశ్, ఉదయ్‌కిరణ్, స్వామి, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

వేగంగా సీఎంఆర్ సేకరణ

- నిర్లక్ష్యం చేసే మిల్లర్లపై చర్యలు తప్పవు
- అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్



మాట్లాడుతున్న శ్యామ్‌ప్రసాద్‌లాల్

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని బకాయిపడ్డ రైస్‌మిల్లర్ల నుంచి సీఎంఆర్ సేకరణలో వేగంపెంచాలని సంబంధిత పౌరసరఫరాలు, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను అడిషనల్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ ఆదేశించారు. శనివారం సంబంధిత అధికారులతో తన కార్యాలయంలో సమావేశమై పలు సూచనలు చేశారు. సీఎంఆర్ ఇవ్వడంలో నిర్లక్ష్యం చేస్తే మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ హెచ్చరించారు. పెండింగ్ సీఎంఆర్ సేకరించి ప్రభుత్వానికి అందించేందుకు అనుసరించాల్సిన పద్ధతులను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు వివరించారు. ప్రతీ రైస్ మిల్లరు నుంచి రోజువారీ మిల్లింగ్ సామర్థ్యాన్ని బట్టి సీఎంఆర్ డెలివరీ జరిగేలా చూడాలన్నారు. మిల్లర్ల వద్ద ఉన్న ధాన్యాన్ని సక్రమంగా నడిపించే మరో మిల్లుకి తరలించాలని ఆదేశించారు.

రేషన్‌దుకాణాలపై నిఘా..

జిల్లాలోని రేషన్ దుకాణాల ద్వారా పేదలకు సబ్సిడీ బియ్యాన్ని సక్రమంగా అందించేలా చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ అన్నారు. సబ్సిడీ బియ్యాన్ని కొందరు డీలర్లు పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్టంగా అమలు పర్చాలని, ఎవరైనా సబ్సిడీ బియ్యాన్ని అక్రమంగా దారి మళ్లిస్తున్నట్లు గుర్తిస్తే కఠినంగా వ్యవహరించి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తూ నిబంధనలను పాటించాలన్నారు. నిబంధనల మేరకు రైస్ మిల్లులు, రేషన్ షాపుల్ని తనిఖీ చేస్తూ ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్ట పర్చాలని ఆదేశించారు. జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోకు పకడ్బందీ ఏర్పాట్లు

- నేడు ఐదేళ్లలోపు చిన్నారులకు చుక్కల మందు
- జిల్లాలో 62,700 మంది చిన్నారుల గుర్తింపు
- జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని ఐదేళ్లలోపు వయసు గల చిన్నారులందరికీ చుక్కల మందు వేసేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి ప్రమోద్‌కుమార్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో డెప్యూటీ డీఎంహెచ్‌వో కృపాబాయితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైకల్య నియంత్రణ కోసం వేస్తున్న పోలియో చుక్కలను తప్పనిసరిగా చిన్నారులకు వేయించాలని అన్నారు. పోలియో రహిత దేశంగా మనదేశం గుర్తింపు పొందిందని గుర్తుచేశారు. కానీ, కొన్ని దేశాల్లో పోలియో ఇప్పటికీ ఉందని, మళ్లీ వచ్చే అవకాశం లేకపోలేదన్న కారణంతో పిల్లలకు రక్షణ కల్పించేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆదివారం పోలియో చుక్కలు వేసేందుకు గ్రామాలు, పట్టణ వార్డుల్లో పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు.

62,700 మంది చిన్నారుల గుర్తింపు..

- జిల్లాలో 62,700 మంది ఐదేళ్లలోపు వయసు గల చిన్నారులు ఉన్నట్లు గుర్తించామని డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ తెలిపారు.
- వారందరికీ 4,040 వాయల్స్‌తో పోలియో చుక్కలు వేస్తామని ఆయన పేర్కొన్నారు.
- ఇందుకోసం 381 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.
- నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాలతోపాటు ఆర్టీసీ బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లలోనూ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.
- ఏదైనా కారణంతో పోలియో చుక్కలు వేయించుకోని వారికోసం ఈనెల 4, 5వ తేదీల్లో ఇంటింటికీ వెళ్లి వారికి కూడా చుక్కల మందు వేయిస్తామని పేర్కొన్నారు.
- అలాగే జిల్లాలో 149 హైరిస్క్ ప్రాంతాలు(వలస కార్మికులు, ఇటుక బట్టీలు, నిర్మాణ రంగ కార్మికులు) గుర్తించి, వారిపిల్లలకు ప్రత్యేకంగా 24 బృందాలను ఏర్పాటు చేశామని ఆయన వివరించారు.
- వీరందరికీ చుక్కల మందు వేస్తామని ఆయన పేర్కొన్నారు.





ఉద్యోగ ‘పాట్లు’

జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో తాత్కాలిక ఉద్యోగాల కోసం దరఖాస్తు చేస్తున్న అభ్యర్థులు వీరు. దరఖాస్తులు పూరించేందుకు విద్యావంతులైన నిరుద్యోగులు ఇలా పాట్లు పడుతూ కనిపించారు. చంటిపాపలను తమ కుటుంబీకులు ఎత్తుకుని లాలిస్తూ ఉంటే.. ఉద్యోగం రాకపోతుందా.. అనే చిన్న ఆశతో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచే కాకుండా పొరుగు జిల్లాలైన మంచిర్యాల, జగిత్యాల, సిరిసిల్ల, జయశంకర్ భూపాలపల్లి నుంచి ఇలా పిల్లాపాపలతో తరలివచ్చి దరఖాస్తులు పూరించారు. ఆ తర్వాత అధికారులకు వాటిని సమర్పించారు. – పెద్దపల్లిరూరల్

కష్టాల వాకిట.. విజయబావుటా





- పట్టుబట్టారు.. కొలువులు కొట్టారు
- పోటీ పరీక్షల ఫలితాల్లో సత్తాచాటిన ఉమ్మడి జిల్లావాసులు
- ఒకొక్కరికి ఒకటి నుంచి ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు
- పేద కుటుంబాల్లో వెలుగులు

పేద కుటుంబాలు కొందరివి.. ఎలాగైనా జీవితంలో స్థిరపడాలన్న తపన మరికొందరిది.. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న కల ఇంకొందరిది.. సర్కారు కొలువు కొట్టాలని ఏళ్లుగా కష్టపడ్డారు.. ఈ ప్రయత్నంలో అపజయాలు ఎదురైనా పట్టువదల్లేదు.. పోటీ పరీక్షలకు సిద్ధమై, రాశారు.. ప్రభుత్వం ప్రకటించిన టీచర్, లెక్చరర్ పోస్టులకు ఎంపికై, విజయ బావుటా ఎగురవేశారు.. తమ కుటుంబాల్లో వెలుగులు తీసుకువచ్చారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన పలువురు ఒకటి నుంచి ఐదు ఉద్యోగాలు సాధించి, యువతకు ఆదర్శంగా నిలిచారు. అలాంటివారిపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

భీవండిలో మెకానిక్‌గా పని చేశా



సిరిసిల్ల కల్చరల్: 2010లో పదోతరగతితో చదువు ఆపేశాను. నేత కార్మిక కుటుంబం కాబట్టి బతుకుదెరువు కోసం భీవండికి వెళ్లి, ఆరేళ్లు బైక్ మెకానిక్‌గా పని చేశాను. తిరిగి సిరిసిల్ల వచ్చి దూరవిద్యలో డిగ్రీ చదివాను. 2009లో రెగ్యులర్‌గా బీఈడీ చదివి, ఆ పైన ప్రైవేట్ సంస్థల్లో ఉపాధ్యాయుడిగా పని చేశాను. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో పని చేస్తున్నాను. రాత్రీపగలు తేడా లేకుండా పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యాను. టీజీటీతోపాటు సివిక్స్ జేఎల్ ఉద్యోగాలకు ఎంపికయ్యాను. నా విజయాన్ని చూడకుండానే నాన్న గత డిసెంబర్‌లో చనిపోయారు.

– కొలిపాక విష్ణు, టీజీటీ, జేఎల్ విజేత, పద్మనగర్, సిరిసిల్ల

హార్డ్ వర్క్‌ను నమ్మాను



సిరిసిల్ల కల్చరల్: మాది మధ్యతరగతి కుటుంబం. పవర్‌లూమ్స్ పనిచేసే అమ్మానాన్న మా కోసం నిరంతరం శ్రమించేవాళ్లు. నేను హైదరాబాద్ నిజాం కాలేజీలో ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ పూర్తి చేశా. కరీంనగర్‌లో బీఈడీ చదివా. నెట్ క్వాలిఫై అయ్యాను. కొన్నాళ్లపాటు రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీలో లెక్చరర్‌గా పని చేశాను. ఇప్పుడు జూనియర్, డిగ్రీ లెక్చరర్ పోస్టులు రెండింటికీ ఎంపికయ్యాను. హార్డ్ వర్క్ ఎప్పటికైనా ఫలితాన్నిస్తుందని నమ్మి ప్రయత్నించాను. జాబ్ రాకుండా పెళ్లి జీవితం సంపూర్ణం కాదని నాన్న చెప్పిన స్ఫూర్తి పాఠమే నా విజయానికి కారణంగా భావిస్తున్నా.

– కోడం పూర్ణిమ, జేఎల్, డీఎల్ విజేత, మార్కండేయ నగర్, సిరిసిల్ల

నాన్నను ఒప్పించి చదువుకున్నాను



సిరిసిల్ల కల్చరల్: మాది వేములవాడ మండలంలోని తిప్పాపురం. నేత పనిని నమ్ముకొని బతుకుదెరువు కోసం మహారాష్ట్రలోని భీవండికి వలస వెళ్లాం. నా చదువంతా అక్కడే సాగింది. పుణే, ముంబై యూనివర్సిటీల నుంచి డిగ్రీ, పీజీ పూర్తి చేశాను. 14 ఏళ్ల క్రితం ఉన్న ఊళ్లోనే ఉపాధి దొరుకుతోందని సిరిసిల్లకు వచ్చి, బీవైనగర్‌లో స్థిరపడ్డాం. ఇప్పుడు నాన్న లేరు. కానీ, నా ఎదుగుదల కోసం ఆయన పడ్డ తాపత్రయం అంతా ఇంతా కాదు. చదివించలేనని నిస్సహాయంగా చెబితే ఒప్పించి, చదువుకున్నాను. నాన్ లోకల్ విభాగంలో ఉన్న 3 పోస్టుల్లో ఒకటి సాధించాను. ఎకనామిక్స్ జూనియర్ లెక్చరర్ పోస్టుకు ఎంపికయ్యా. – జె.కైలాస్, జేఎల్ విజేత, బీవై నగర్

పేదరికానికి పెద్ద చదువులే మందు



సిరిసిల్ల కల్చరల్: నేను పదోతరగతిలో ఉన్నప్పుడు నాన్న చనిపోయారు. అమ్మ బీడీ కార్మికురాలిగా అలసిపోయి, ఇప్పుడు రిటైరైంది. అన్నయ్య ఆర్టిస్ట్. ఇంటర్మీడియట్ వరకు ప్రభుత్వ రంగ సంస్థల్లో చదువుకున్నాను. కాకతీయ వర్సిటీ నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశాను. పేదరికానికి మందు పెద్ద చదువులే అని నమ్మి, అన్నయ్య ప్రోత్సాహంతో ఉన్నత చదువులు కొనసాగించాను. ఒడిశాలోని భువనేశ్వర్ ఐఐటీలో ఫిజిక్స్‌లో పీహెచ్‌డీ చేశాను. నిరంతరం కష్టపడి, ఇప్పుడు ఫిజిక్స్‌లో జేఎల్ పోస్టుకు ఎంపికయ్యాను.

– చౌకి శ్రీకాంత్, జేఎల్ విజేత, పద్మనగర్, సిరిసిల్ల

ఎలాంటి కోచింగ్ తీసుకోలేదు



సిరిసిల్ల కల్చరల్: కొన్నాళ్లుగా ప్రభుత్వ ఉద్యోగం కోసం సీరియస్‌గా ప్రయత్నిస్తున్నాను. వేములవాడలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పని చేస్తూనే పోటీ పరీక్షలకు సిద్ధమయ్యాను. ఎలాంటి కోచింగ్ తీసుకోలేదు. గతంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో సీడీపీవో ఉద్యోగం స్వల్ప మార్కులతో చేజారింది. ఇదే విభాగంలో గ్రేడ్ వన్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ ఉద్యోగానికి రాష్ట్రస్థాయి ర్యాంకు వచ్చింది. ప్రస్తుతం గురుకుల బోర్డు విడుదల చేసిన ఫలితాల్లో టీజీటీ బయాలాజికల్ సైన్స్ పోస్టుకు ఎంపికయ్యాను.

– ఆసరి స్వప్న, టీజీటీ విజేత, ధర్మారం, కోనరావుపేట

'పది' పరీక్షలు ప్రైవేట్‌గా రాశాను



సిరిసిల్ల కల్చరల్: మాది మారుమూల ప్రాంతం కావడంతో పదోతరగతి పరీక్షలు ప్రైవేట్‌గా రాశాను. తర్వాత డిగ్రీ, బీఈడీ పూర్తి చేశాను. కేజీబీవీ ఉపాధ్యాయ పరీక్ష రాసి, రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంక్ సాధించాను. ప్రస్తుతం ఇబ్రహీంపట్నంలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న. గురుకుల బోర్డు నిర్వహించిన పరీక్షలో రాష్ట్రస్థాయిలో 29వ ర్యాంకు సాధించాను. టీజీటీ బయాలాజికల్ సైన్స్ పోస్టుకు ఎంపికయ్యాను.

– దుంద్ర మౌనిక, టీజీటీ విజేత, గొల్లపల్లి వట్టిమల్ల, కోనరావుపేట

వరుసగా నాలుగు ఉద్యోగాలు



ఇల్లందకుంట(హుజూరాబాద్): మాది ఇల్లందకుంట మండలంలోని మల్యాల గ్రామం. నేను మహబూబాబాద్ జిల్లాలోని పర్వతగిరి గురుకులంలో టెన్త్, ఇంటర్ పూర్తి చేశా. భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో డిగ్రీ, ఉస్మానియాలో పీజీ చదివా. ఇటీవల వరుసగా విడుదలైన ఉద్యోగ నియామక ఫలితాల్లో టీజీజీ, పీజీటీ, జేఎల్, డీఎల్ ఉద్యోగాలు సాధించాను. నా భర్త రాజశేఖర్ మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్‌లో ఆర్మీ ఉద్యోగం చేస్తున్నారు. నేను కూడా అక్కడే ఉంటూ ఆర్మీ పబ్లిక్ స్కూల్లో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ పోటీ పరీక్షల కోసం కష్టపడి, విజయం సాధించాను.

– కనకం మౌనిక, టీజీజీ, పీజీటీ, జేఎల్, డీఎల్ విజేత, మల్యాల, ఇల్లందకుంట

నోట్స్ తయారు చేసుకున్న



కరీంనగర్: మాది కరీంనగర్ జిల్లా కేంద్రంలోని సప్తగిరికాలనీ. నేను మొదటి ప్రయత్నంలోనే జేఎల్ ఉద్యోగానికి ఎంపికయ్యాను. ఎలాంటి కోచింగ్ లేకుండా ఇంట్లోనే నోట్స్ తయారు చేసుకొని, గ్రంథాలయంలో చదివాను. నేను పీజీ, బీఈడీ పూర్తి చేశాను. గురువారం వెలువడిన గురుకుల ఉద్యోగ ఫలితాల్లో జేఎల్ ఇంగ్లిష్ పోస్టుకు ఎంపికయ్యాను. కాంపిటీషన్ ఉందని, భయపడవద్దని, సొంతగా నోట్స్ తయారు చేసుకొని, పక్కా ప్రణాళికతో చదివితే విజయం దరిచేరుతుంది.

– ఎస్.రాజశేఖర్‌రావు, జేఎల్ విజేత, సప్తగిరికాలనీ, కరీంనగర్

పదేళ్లుగా ప్రిపేరవుతున్నాను



గంభీరావుపేట(సిరిసిల్ల): మాది జగదాంబతండా. నేను గురుకుల ఫలితాల్లో టీజీటీ, పీజీటీ, జేఎల్ ఉద్యోగాలు సాధించా. ప్రభుత్వ ఉద్యోగం కోసం పదేళ్లుగా ప్రిపేరవుతున్నాను. గతంలో ఒకటి, రెండు మార్కుల తేడాతో కొలువులు కోల్పోయాను. అయినా నిరాశకు చెందకుండా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యాను. ఇటీవల నా భార్య పద్మకు స్టాఫ్ నర్స్ ఉద్యోగం వచ్చింది. మా విజయం నా తల్లిదండ్రులకు అంకితం.

– అనిల్‌కుమార్, టీజీటీ, పీజీటీ, జేఎల్ విజేత, జగదాంబతండా, గంభీరావుపేట

సంతోషంగా ఉంది



ముస్తాబాద్(సిరిసిల్ల): మాది చీకోడు గ్రామం. నేను ప్రస్తుతం వేములవాడ కస్తూరిబా బాలికల విద్యాలయంలో ఉపాధ్యాయినిగా పని చేస్తున్నాను. ఇదివరకు గ్రూప్–4 ఉద్యోగం సాధించాను. తాజాగా గురుకుల జూనియర్ లెక్చరర్(ఫిజిక్స్)గా ఎంపికవడం సంతోషంగా ఉంది.

– గంపల సుప్రజ, జేఎల్ విజేత, చీకోడు, ముస్తాబాద్

టీచర్ అవ్వాలనుకున్నాను..



రామడుగు(చొప్పదండి): మాది గోపాల్‌రావుపేట. నాన్న ఆదర్శ రైతు ఎడవెల్లి కిషన్‌రెడ్డి, అమ్మ అరుణ. నేను ప్రస్తుతం పీహెచ్‌డీ మొదటి సంవత్సరం చదువుతున్నాను. వరుసగా టీజీటీ, పీజీటీ, జేఎల్, డీఎల్ ఉద్యోగాలు సాధించాను. చిన్నప్పటి నుంచి టీచర్ అవ్వాలని అనుకున్నాను. అదే లక్ష్యంగా కష్టపడి చదివి, విజయాన్ని అందుకున్నాను.

– ఎడవెల్లి అంజలి, టీజీటీ, పీజీటీ, జేఎల్, డీఎల్ విజేత, గోపాల్‌రావుపేట, రామడుగు

గురుకులంలోనే చదివాను..



పెద్దపల్లిరూరల్: మాది మంథని మండలంలోని వెంకటాపూర్. అమ్మానాన్న పుష్పలత–రామ్మూర్తి వ్యవసాయం చేస్తుంటారు. నా భర్త కాయిత తిరుపతిరెడ్డి పెద్దపల్లి ఆర్‌అండ్‌బీ శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. నేను పీజీటీ, జేఎల్ ఉద్యోగాలు సాధించాను. భీమదేవరపల్లి మండలంలోని వంగర గురుకుల పాఠశాలలో పదోతరగతి వరకు చదివాను. ఇప్పుడు గురుకుల కళాశాల విద్యార్థులకు పాఠాలు బోధించే అవకాశం దక్కడం సంతోషంగా ఉంది.

– గూడ శైలజ, పీజీటీ, జేఎల్ విజేత, వెంకటాపూర్, మంథని

జేఎల్‌గా న్యాయవాది



హుజూరాబాద్: నేను హుజూరాబాద్ పట్టణంలోని కోర్టులో న్యాయవాదిగా పని చేస్తున్నాను. ఇటీవల ప్రకటించిన గురుకుల పోస్టుల ఫలితాల్లో జూనియర్ లెక్చరర్ ఉద్యోగానికి ఎంపికయ్యాను. మాది మెట్‌పల్లి. ప్రభుత్వ ఉద్యోగ సాధనకు చాలా కష్టపడ్డాను. చివరికి విజయం దక్కింది.

– రవీందర్, జేఎల్ విజేత, హుజూరాబాద్

భర్త అండగా నిలిచారు



కరీంనగర్ అర్బన్: మాది కరీంనగర్‌లోని కిసాన్‌నగర్. అమ్మానాన్న భారతి–మోహన్ ప్రోత్సాహంతో ఎమ్మెస్సీ బాటనీ, బీఈడీ చదివా. 2010లో వివాహం కావడంతో కొన్నాళ్లు గృహిణిగా ఉన్నాను. ఏదైనా ప్రభుత్వ ఉద్యోగం చేయాలన్న కాంక్ష బలంగా ఉండేది. నా ఆలోచనను భర్త రాజుకు చెప్పడంతో అండగా నిలిచారు. మూడేళ్ల క్రితం కస్తూరిబాలో ఉద్యోగం వచ్చింది. ఇప్పుడు టీజీటీ, పీజీటీ, జేఎల్ ఉద్యోగాలకు ఎంపికయ్యా.

– పసుల శ్రీలత, టీజీటీ, పీజీటీ, జేఎల్ విజేత, కిసాన్‌నగర్, కరీంనగర్

ఒకేసారి రెండు కొలువులు



హుజూరాబాద్: మాది హుజూరాబాద్ పట్టణంలోని మామిళ్లవాడ. నిరుపేద కుటుంబం నుంచి వచ్చాను. చదువుపై మక్కువతో కష్టపడి, ఎంఎస్సీ ఫిజిక్స్, బీఈడీ చదివాను. జమ్మికుంట, హనుమకొండలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో లెక్చరర్‌గా పని చేశాను. పోటీ పరీక్షలకు సిద్ధమవగా జేఎల్, డీఎల్ ఒకేసారి రెండు ఉద్యోగాలు వచ్చాయి. చాలా ఆనందంగా ఉంది.

– రాణి, జేఎల్, డీఎల్ విజేత, హుజూరాబాద్

అమ్మ కూలీకి వెళ్తూ చదివించింది



మానకొండూర్: మాది మానకొండూర్ మండలంలోని చెంజర్ల. రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబం. నాన్న రాజమల్లు నా చిన్నప్పుడే చనిపోయాడు. అమ్మ కనకలక్ష్మి కూలీకి వెళ్తూ నన్ను చదివించింది. పెద్దయ్యాక నేనూ కూలీ పనులకు వెళ్తూ ఉన్నత చదువులు చదివా. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీజీ చేశాను. నెట్‌లో జాతీయ స్థాయి రెండో ర్యాంకుతో జూనియర్ ఫెలోషిప్ అందుకున్నా. ప్రస్తుతం ఓయూలోనే పీహెచ్‌డీ చేస్తున్నాను. గురుకుల పోస్టుల ఫలితాల్లో జేఎల్, టీజీటీగా ఎంపికయ్యాను. హైదరాబాద్‌లో పోటీ పరీక్షలకు సిద్ధమవుతుంటే నా స్నేహితులు నెలనెలా డబ్బులు పంపించడం మరిచిపోలేను. వారికి రుణపడి ఉంటా.

అమ్మ బోళ్ల కనకలక్ష్మితో ప్రవీణ్

తొలి ప్రయత్నంలోనే ఐదు కొలువులు



పెగడపల్లి(ధర్మపురి): మాది పెగడపల్లి మండలంలోని ల్యాగలమర్రి. నాన్న భూమయ్య, అమ్మ రమ, సోదరుడు ఉన్నారు. తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తూ నన్ను చదివించారు. నేను పీజీ, బీఈడీ చేశాను. ప్రస్తుతం సిరిసిల్ల సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో కాంట్రాక్టు అధ్యాపకురాలిగా పని చేస్తూ ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రిపేరయ్యా. తొలి ప్రయత్నంలోనే పీజీటీ, టీజీటీ, జేఎల్, డీఎల్, మున్సిపల్ జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్టులకు ఎంపికయ్యాను.

– పుప్పాల మమత

అమ్మానాన్న ప్రోత్సాహం వల్లే..



బుగ్గారం(ధర్మపురి): మాది మద్దునూర్. నిరుపేద కుటుంబం. నా చదువంతా ప్రభుత్వ విద్యాలయాల్లోనే సాగింది. అమ్మానాన్న వ్యవసాయ పనులు చేస్తూ నన్ను ప్రోత్సహించారు. నేను భౌతికశాస్త్ర విభాగంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీజీ చేశాను. పోటీ పరీక్షలకు సిద్ధమవుతూనే ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తున్నాను. నా గురువులు దురిశెట్టి అనంత రామకృష్ణ, కిరణ్, సాయి సార్‌ల మార్గనిర్దేశంలో టీజీటీ, పీజీటీ, జేఎల్, డీఎల్ ఉద్యోగాలు సాధించాను.

– గజ్జెల గంగాధర్, టీజీటీ, పీజీటీ, జేఎల్, డీఎల్ విజేత, మద్దునూర్

దంపతులిద్దరూ ఎంపిక



మెట్‌పల్లిరూరల్: మాది మెట్‌పల్లి మండలంలోని మారుతీనగర్. నేను జేఎల్, టీజీటీ(సోషల్) ఉద్యోగాలకు, నా భార్య స్వపిక టీజీటీ(ఇంగ్లిష్) ఉద్యోగానికి ఎంపికయ్యాం. సంతోషంగా ఉంది.

విజయ్–స్వపిక, మారుతీనగర్, మెట్‌పల్లి

భర్త సహకారంతోనే..



సారంగాపూర్(జగిత్యాల): మాది బీర్‌పూర్ మండల కేంద్రం. నేను శాతవాహన యూనివర్సిటీలో ఎంఏ, బీఈడీ చేశాను. నా భర్త గంగాధర్ జీవనోపాధి కోసం గల్ఫ్ వెళ్లి, ఇటీవలే వచ్చారు. ఆయన సహకారంతోనే టీజీటీ, పీజీటీ, జేఎల్ ఉద్యోగాలు సాధించాను.

– దాసరి స్వప్న, టీజీటీ, పీజీటీ, జేఎల్ విజేత, బీర్‌పూర్

కాంట్రాక్టు ఉద్యోగం వదిలేశా..



ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): మాది రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్. నేను కొన్ని రోజులు కాంట్రాక్టు లెక్చరర్‌గా పని చేశాను. ఆ ఉద్యోగం వదిలేసి, పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యా. భర్త రవికుమార్, కూతురు సహస్ర ప్రోత్సాహంతో టీజీటీ, పీజీటీ, జేఎల్ ఉద్యోగాలకు ఎంపికయ్యా.

– తోట సుజాత, గౌతమినగర్, రామగుండం

భీమారం మండలంలో ముగ్గురికి..


రాజేశ్


నరేశ్


శిరీష

మేడిపల్లి(జగిత్యాల): భీమారం మండల కేంద్రానికి చెందిన బస్వరాజుల రాజేశ్, దేశాయిపేటకు చెందిన నాగుల నరేశ్ టీజీటీ, పీజీటీ, జేఎల్, డీఎల్ ఉద్యోగాలు సాధించారు. మన్నెగూడెం గ్రామానికి చెందిన ఎనగందుల శిరీష జేఎల్‌గా ఎంపికైంది. ఆమెకు ఇద్దరు పిల్లలున్నా కష్టపడి కొలువు కొట్టింది.

క్యాబ్ డ్రైవర్, వెయిటర్‌గా చేశా



శంకరపట్నం(మానకొండూర్): మాది గద్దపాక గ్రామం. పేద కుటుంబం. నేను మానకొండూర్ మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పని చేశా. కరోనా సమయంలో పాఠశాలలు మూతపడటంతో బతుకుదెరువు కోసం క్యాబ్ డ్రైవర్‌గా, వాచ్‌మెన్‌గా, హోటల్‌లో వెయిటర్‌గా చేశాను. పోటీ పరీక్షలకు సన్నద్ధమై, టీజీటీగా ఎంపికయ్యా.

– యామునూరి ప్రవీణ్, టీజీటీ విజేత, గద్దపాక, శంకరపట్నం

సూర్యాపేట జిల్లాలో రోడ్డు ప్రమాదం

- జిల్లాకు చెందిన ఇద్దరు యువకుల మృతి
- గంగాధర మండలం కాచిరెడ్డిపల్లిలో విషాదం


రమేశ్ (ఫైల్)


విక్రమ్ (ఫైల్)

కరీంనగర్‌క్రైం/గంగాధర/తిరుమలగిరి: సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలంలో శనివారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కాచిరెడ్డిపల్లెకు చెందిన కుంట రమేశ్(31), కోల విక్రమ్ (30) మరో ఇద్దరు స్నేహితులతో కలిసి కారులో తిరుపతికి వెళుతున్నారు. వేకువజామున మూడు గంటల సమయంలో తిరుమలగిరి అంబేడ్కర్ నగర్‌లో కారువేగంగా వెళ్లి సైడ్‌కు ఉన్న గోడను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఎడమ వైపు ఉన్న కుంట రమేశ్, వెనుక సీటులో ఉన్న కోల విక్రమ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా ఇద్దరూ మృతి చెందారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను తుంగతుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కాచిరెడ్డిపల్లిలో విషాదఛాయలు..

సూర్యాపేట జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గంగాధర మండలం కాచిరెడ్డిపల్లికి చెందిన ఇద్దరు యువకులు మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన కుంట రమేశ్ బెంగళూర్‌లోని ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నారు. ఈయన తండ్రి చిన్నతనంలో చనిపోయారు.

తండ్రీకొడుకులు రోడ్డు ప్రమాదంలోనే...

మరో మృతుడు విక్రం తండ్రి సదానందం సైతం గతంలో రోడ్డు ప్రమాదంలోనే మృతిచెందాడు. తల్లి కూలీ పనులకు వెళ్తోంది. ఈయన కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. ఒక్కగానొక్క కొడుకు మృతిచెందడంతో తల్లి సరోజన గుండెలవిసేలా రోదించింది.

చెరువులో మునిగి పశువుల కాపరి మృతి

మెట్‌పల్లిరూరల్(కోరుట్ల): చెరువులో మునిగి ఓ పశువుల కాపరి మృతి చెందినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా కొమ్ముగూడెం గ్రామానికి చెందిన కోడి స్వామి(44) మెట్‌పల్లి మండలంలోని వేంపేటకు వలస వచ్చాడు. కొంతకాలంగా ఇక్కడే నివాసం ఉంటూ గేదెలు మేపుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం కొన్ని గేదెలు చెరువులోకి వెళ్లాయి. వాటిని బయటకు తరిమేందుకు వెళ్లిన స్వామి చెరువు లోతుగా ఉండటంతో నీటమునిగాడు. ఊపిరాడక మృతిచెందాడు. మృతుడి భార్య ప్రేమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

విందులో పలువురికి అస్వస్థత

కోరుట్ల రూరల్: అయిలాపూర్‌లోని ఓ ఇంట్లో శనివారం విందుకు హాజరైన తొమ్మిది మంది అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరేచనాలు కావడంతో వెంటనే ఆస్పత్రులకు తరలించారు. శాన్విక, ప్రియ, మౌనిక, గంగమణి, మైత్రి కోరుట్ల ప్రభుత్వ దవాఖానాలో, మరో నలుగురు ఐలాపూర్ పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నట్లు వైద్యులు తెలిపారు.

ప్రేమించిన యువతికి నిశ్చితార్థమైందని..

- ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య
- మెట్‌పల్లి మండలం వెల్లులలో ఘటన


హరీశ్ (ఫైల్)

మెట్‌పల్లిరూరల్: ప్రేమించిన యువతిని విడిచి ఉండలేకపోయాడు.. ఆమెకు మరొకరితో పెళ్లి నిశ్చయమైందని తెలుసుకొని, తట్టుకోలేకపోయాడు.. చేసేదిలేక ఆత్మహత్య చేసుకున్నాడు మెట్‌పల్లి మండలం వెల్లుల గ్రామానికి చెందిన నేరెళ్ల హరీశ్(25). పోలీసుల వివరాల ప్రకారం.. హరీశ్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కొంతకాలంగా ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. ఆమెకు ఇటీవల మరో వ్యక్తితో నిశ్చితార్థం జరిగింది. దీంతో మనస్తాపానికి గురై, మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో గత గురువారం పక్క గ్రామమైన జగ్గాసాగర్‌లోని తన చిన్న అమ్మమ్మ ఇంటికి తల్లితో కలిసి వెళ్లాడు. శనివారం మధ్యాహ్నం వారు పని నిమిత్తం బయటకు వెళ్లగా ఉరేసుకున్నాడు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు హరీశ్ మృతదేహాన్ని మెట్‌పల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, ప్రేమించిన అమ్మాయికి వేరే వ్యక్తితో వివాహం కుదిరిందన్న బాధతోనే తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తల్లి లలిత ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

బాలుడి విక్రయంపై అధికారుల విచారణ

- ఇంటికి తాళం వేసి వెళ్లిన తల్లి
- దత్తత తీసుకున్న వారి వివరాలు సేకరిస్తున్న అధికారులు


విచారణ చేస్తున్న బాలల సంరక్షణ అధికారులు

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధి టీఆర్‌నగర్‌లో ఓ మహిళ తన కుమారుడిని దత్తత పేరుతో విక్రయించిన సమాచారం మేరకు శనివారం డీడబ్ల్యూఓ వాణిశ్రీ ఆదేశాల మేరకు డీసీపీఓ హరీశ్ విచారణ చేపట్టారు. బాలుడి ఇంటితోపాటు అంగన్‌వాడీ కేంద్రం, బాలుడి చదివే ప్రభుత్వ పాఠశాలలో ఆరా తీశారు. బాలుడు వారం రోజులుగా పాఠశాలకు రావడం లేదని ఉపాధ్యాయులు తెలిపారు. బాలుడి తల్లిని అధికారులు ఫోన్‌లో సంప్రదించగా.. దత్తత తీసుకున్న వారి వివరాలు వెల్లడించినట్లు సమాచారం. దత్తత తీసుకున్న విధానం చెల్లుబాటు కాదని, ప్రభుత్వం నిబంధనల మేరకు దత్తత తీసుకోవాలని దత్తత తీసుకున్నవారికి వివరించినట్లు అధికారులు తెలిపారు.